నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4 PM www.suryaa.com
సోమవారం
15-09-2025
పేజీలు: 02




## టార్గెట్ జూబ్లీహిల్స్.. రంగంలోకి కేటీఆర్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు స్థానిక సంస్థల, జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం చూపుతాయని పార్టీలు భావిస్తున్నాయి. తమ ప్రాబల్యం తగ్గలేదని నిరూపించుకోవడానికి బీఆర్ఎస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రంగంలోకి దిగి, డివిజన్ల వారీగా నేతలతో సమావేశమవుతున్నారు.

# ఏపీ మెగా డీఎస్సీ తుది జాబితా విడుదల!

మెగా డీఎస్సీ -2025 తుది జాబితాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. 16,347 పోస్ట్‌లకు గాను రెండు విడతలుగా పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.. మెగా డీఎస్సీ పరీక్షల అనంతరం.. జూలై 5న ప్రాథమిక కీ విడుదల చేసిన ప్రభుత్వం.. ఆగస్టు 1న ఫైనల్ కీ విడుదల చేసింది.. అనంతరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ను పూర్తి చేసింది.. మొత్తం ప్రక్రియ అనంతరం డీఎస్సీ తుది ఎంపిక జాబితాను (సెప్టెంబర్ 15) ప్రభుత్వం విడుదల చేసింది. డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో https://apdsc.apcfss.in/ తుది ఎంపిక జాబితాను విడుదల చేసింది.. 16,347 పోస్ట్ లకు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మెగా డీఎస్సీ వాగ్దానం నెరవేరిందని పేర్కొన్నారు. ఈ మైలురాయి బాధ్యతను మరింత పెంచిందన్నారు. హామీ ఇచ్చినట్టుగా ప్రతిఏటా డీఎస్సీ నిర్వహిస్తామని.. ఈసారి రాలేకపోయినవారు నిరుత్సాహపడొద్దని లోకేశ్ సూచించారు. మెగా డీఎస్సీ తుది ఎంపిక జాబితా.. జిల్లా విద్యాశాఖాధికారి, కలెక్టర్ కార్యాలయాలలో, అలాగే మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంటుందని అధికారులు తెలిపారు. పాఠశాల విద్యా శాఖ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఏప్రిల్ 20, 2025న జారీ అయింది. ప్రభుత్వ, పంచాయతీ రాజ్, మున్సిపల్ పాఠశాలలతో పాటు గిరిజన, సామాజిక, బీసీ, బాలల సంక్షేమం, మోడల్, రెసిడెన్షియల్, ప్రత్యేక




పాఠశాలల్లో 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం కోసం.. నోటిఫికేషన్ ను విడుదల చేశారు. మే 15 వరకు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 3,36,300 మంది అభ్యర్థులు 5,77,675 దరఖాస్తులను సమర్పించారు. సీబీటీ పరీక్షలు జూన్ 6 నుండి జూలై 2 వరకు ప్రతిరోజూ రెండు షిఫ్టులలో నిర్వహించారు. ప్రిలిమినరీ కీని జూలై 5న, ఫైనల్ కీని ఆగస్టు 1న విడుదల చేశామని.. టెట్ స్కోర్‌లకు 20 శాతం వెయిటేజీ ఇచ్చామని డీఎస్సీ కన్వీనర్ వెంకట కృష్ణారెడ్డి చెప్పారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఏడు దశల్లో పూర్తయిందని వెల్లడించారు.

### తెలుగు వాళ్లు అగ్రస్థానంలో ఉండాలన్నదే ఆలోచన: సీఎం

నిర్దిష్టమైన ఆలోచనతో ముందుకు వెళ్తే ఏదైనా సాధించ కలుగుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సోమవారం అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలోనే తెలుగు వాళ్లు అగ్రస్థానంలో ఉండాలనేదే తన ఆలోచన అని పేర్కొన్నారు. సామాజిక న్యాయాన్ని పరిగణిస్తూ సమర్థతకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. డబుల్ ఇంజిన్ సర్కార్.. డబుల్ డిజిట్ గ్రోత్ అని ఆయన చెప్పారు. 15 శాతం వృద్ధిరేటు సాధించగలగాలంటూ ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లకు సీఎం చంద్రబాబు పిలుపు నిచ్చారు. తలసరి ఆదాయం పెంచేలా కృషి చేయాలని వారికి సూచించారు. ప్రజలు తమపై చూపిన విశ్వాసాన్ని నిలబెట్టు కోంటామని ఆయన ఆకాంక్షించారు. కొత్తగా వచ్చిన కలెక్టర్లందరికీ ప్రజల తరపున ఆయన అభినందనలు చెప్పారు. పాత కలెక్టర్లు సైతం తమ పని తీరును నిరూపించుకోవాలని కోరారు. జిల్లా రూపురేఖలు మార్చే అవకాశం కలెక్టర్లకు ఉందని ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. పాలసీ ఇవ్వడమే కాదే.. అమలు చేయడం ముఖ్యమన్నారు. పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఎకో సిస్టమ్ తయారు చేయాలి.. భారత్ ప్రథమస్థానంలో నిలవాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. మోదీ ప్రధానిగా వచ్చాక 11వ స్థానంలో ఉన్నామని.. ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తయారైందని వివరించారు.

## కియారా అద్వానీకి అయిదో షాక్

అందం, హిట్లు రెండు ఉన్న లక్కీ హీరోయిన్ గా మొన్నటిదాకా మంచి ఊపు మీదున్న కియారా అద్వానీకి బాక్సాఫీస్ వద్ద వరస షాకులు తగులుతున్నాయి. ఒకటి రెండు ఏకంగా అయిదు ఫ్లాపులు క్యూ కట్టడంతో పారితోషికం పరంగా నెలకొన్న డిమాండ్ క్రమంగా తగ్గిపోయేలా ఉంది. చివరి సక్సెస్ తనకు 2022లో 'భూల్ భులయ్యా 2'తో దక్కింది. దాని విజయంలో హీరో కార్తీక్ ఆర్యన్ దే ప్రధాన పాత్ర అయినప్పటికీ కియారాకు కూడా పేరు తీసుకొచ్చింది. ఆ తర్వాత కామెడీ ఎంటర్ టైనర్ 'జగ్ జగ్ జియో' అంతంతమాత్రంగానే ఆడింది. ఎన్నో వాయిదాలు పడుతూ వచ్చిన విక్కీ కౌశల్ 'గోవిందా మేరా నామ్' ఫలితం కూడా సోసోనే.మొన్నటి ఏడాది 'సత్యప్రేమ్ కీ కథ' కొన్ని ఏ సెంటర్స్ ఓ మోస్తరుగా ఆడినప్పటికీ ఓవరాల్ గా చూసుకుంటే నిరాశే కలిగించింది. నిన్న జనవరిలో రిలీజైన 'గేమ్ ఛేంజర్' గురించి చెప్పనక్కర్లేదు. వినయ వినయ విధేయ రామ కాంబోని రిపీట్ చేస్తూ రామ్ చరణ్ కి జోడి కడితే రిజల్ట్ కూడా మళ్ళీ పునరావృత్తమయ్యింది. తాజాగా వార్ 2 ఏమాయ్యిందో కళ్ళముందు కనిపిస్తోంది. బికినీ షాట్ తప్ప తన గురించి మాట్లాడుకోవడానికి ఏం లేకుండా పోయింది. పెర్ఫార్మన్స్ కోసమన్నట్టు ఓ రెండు ఫైట్లు, ఎమోషనల్ సీన్లు పెట్టారు.





## హజారీబాగ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు మావోయిస్టులు మృతి

వరుస ఎన్‌కౌంటర్లతో పెద్ద ఎత్తున క్యాడర్‌ను కోల్పోతున్న మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లోని హజారీబాగ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు అగ్రనాయకుడు సహా మరో ఇద్దరు మృతిచెందారు. సోమవారం తెల్లవారుజామున హజారీబాగ్ జిల్లాలోని గిర్డి-బొకారో సరిహద్దుల్లో మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో కోబ్రా బెటాలియన్, స్థానిక పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల సమయంలో కరండి గ్రామ సమీపంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. దీంతో అక్కడి నుంచి తప్పించుకునే క్రమంలో పోలీసు బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. ప్రతిగా భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు, మోస్ట్ వాంటే లీడర్ సహదేవ్ సోరెన్, జోనల్ కమిటీ సభ్యుడు బిర్సేన్ గంఝూ అలియాస్ రామ్‌ఖేలవాన్, బీహార్-జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ సభ్యుడు రఘునాథ్ హెబ్రామ్ అలియాస్ చంచల్ మరణించారని పోలీసులు తెలిపారు.

## లండన్‌లో వలసలకు వ్యతిరేకంగా లక్షలాది మందితో భారీ ప్రదర్శన

బ్రిటన్‌లో వలసదారుల సంఖ్య పెరిగిపోవడంపై స్థానికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. తమ దేశాన్ని తమకే వదిలేయాలంటూ లక్షలాది మంది లండన్ వీధుల్లోకి వచ్చి ఆందోళన చేపట్టారు. "మా దేశాన్ని మాకు ఇచ్చేయండి" అనే నినాదాలతో శనివారం సాయంత్రం లండన్ నగరం దద్దరిల్లింది. ఈ నిరసన కార్యక్రమం హింసాత్మకంగా మారడంతో పోలీసులతో ఘర్షణ చోటుచేసుకుంది.జాతీయవాద నేత టామీ రాబిన్సన్ నేతృత్వంలో లక్ష మందికి పైగా నిరసనకారులు యూకే జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఉండే వైట్‌హాల్ ప్రాంతంలోకి చొచ్చుకువెళ్లేందుకు ప్రయత్నించిన ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో 26 మంది పోలీసు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చించివేసి తమ నిరసన తెలిపారు.ఈ ఆందోళనలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వర్చువల్‌గా పాల్గొని ప్రసంగించారు. "నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా పతనమవుతోంది. మీరు హింసను ఎంచుకోకపోయినా, హింసే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తోంది. దాన్ని ఎదుర్కోవాలి, లేదంటే ప్రాణాలు వదలాలి. ఇదే వాస్తవం" అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, టామీ రాబిన్సన్ నిరసనకు వ్యతిరేకంగా పలువురు బ్రిటన్ ఎంపీలు, వామపక్ష నేతలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు సుమారు 5 వేల మందితో కౌంటర్ ర్యాలీ నిర్వహించారు. రాబిన్సన్ మద్దతుదారులను జాత్యాహంకారులుగా, మహిళా వ్యతిరేకులుగా వారు ఆరోపించారు.ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల నుంచి వలసలు, శరణార్థుల సంఖ్య పెరిగిపోవడంతో తమ సంస్కృతి దెబ్బతింటోందని, నేరాలు అధికమవుతున్నాయని బ్రిటన్‌లోని జాతీయవాద వర్గాలు



కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. యూకే ప్రభుత్వ గణాంకాల ప్రకారమే 2024 చివరి నాటికి దేశంలో 5,15,697 మంది అధికారిక శరణార్థులు ఉన్నారు. మరో లక్షా 24 వేల మందికి పైగా ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. చట్టవిరుద్ధంగా దేశంలో నివసిస్తున్న వారి సంఖ్య 10 నుంచి 15 లక్షల వరకు ఉండవచ్చని అంచనా.



## డిగ్రీ విద్యార్థిని హత్యాచార నిందితుడికి జీవిత ఖైదు

డిసెంబర్ 16, 2012లో ఢిల్లీలో చోటు చోటు చేసుకున్న నిర్భయ సామూహిక అత్యాచార ఘటన దేశాన్ని కుదిపేసిన సంగతి తెలిసిందే. మహిళల భద్రత, చట్టాల గురించి దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలకు దారితీసింది. 23 ఏళ్ల ఫిజియోథెరపీ విద్యార్థిని ఆరుగురు వ్యక్తులు బస్సులోనే అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె స్నేహితుడిపై దాడి చేసి ఆ దారుణానికి ఒడిగట్టారు. 13 రోజుల పాటు ప్రాణాలతో పోరాడిన ఆమె.. ఆ తర్వాత ప్రాణాలు విడిచింది. కేసు ఘటన దేశవ్యాప్తంగా ప్రజలను ఆగ్రహానికి గురి చేసింది.

## ఆ సినిమా వలన చాలా నష్టపోయాను.. ఆవేదన వ్యక్తం చేసిన అమీర్ ఖాన్



బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ అమీర్ ఖాన్ కెరీర్‌లో అతిపెద్ద ఫ్లాప్‌గా లాల్ సింగ్ చద్దా నిలిచిన విషయం తెలిసిందే. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా భారీ నష్టాలను మిగిల్చి, అమీర్‌ను తీవ్రంగా బాధించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాతో తాను ఎదుర్కొన్న అనుభవాలను అమీర్ బయటపెట్టారు. అమీర్ వెల్లడించిన దాని ప్రకారం.. "దంగల్" సినిమా ఇండియాలో 385 కోట్ల వసూళ్లు రాబట్టింది. లాల్ సింగ్ చద్దాకి కనీసం 100 కోట్లు వస్తుందని ఆశపడ్డారను. కానీ, సినిమా రిలీజ్ అయ్యాక ఫస్ట్ షోకే నెగటివ్ టాక్ రావడం, థియేటర్ల వద్ద ఖాళీ కుర్చీలు కనిపించడం ఆయనను షాక్‌కి గురిచేసిందట. చివరికి ఈ సినిమా వల్ల దాదాపు 200 కోట్ల రూపాయల నష్టం వచ్చిందని అమీర్ తెలిపారు. ఈ సినిమా ద్వారా నాగచైతన్య హిందీలో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి ఆసక్తి ఉండటంతో చిరంజీవి వంటి ప్రముఖులకు ప్రీమియర్ షో వేయడంతో మూవీకి తెలుగులోను గట్టి ప్రచారమే జరిగింది. అయినప్పటికీ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేదు. అమీర్ నటనపైనా విమర్శలు వెల్లువెత్తాయి. కరోనా సమయంలో ఈ సినిమా షూటింగ్ జరగడం వల్లే చాలా ఖర్చులు పెరిగాయని అమీర్ తెలిపారు. విదేశాల్లో తీసిన కొన్ని కీలక ఎపిసోడ్‌లు చివరికి ఎడిటింగ్‌లో తీసేయాల్సి వచ్చాయట. టేబుల్ టెన్నిస్ నేపథ్యంలో ఉన్న ఓ సీన్‌కి కోట్లు ఖర్చుపెట్టారట. కానీ ఎడిటింగ్‌లో లేపేసారట. ఇవన్నీ బూడిదలో పోసిన పన్నీరు అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవర్సీస్ మార్కెట్‌లోనైనా ఈ సినిమా నడుస్తుందనుకున్నారు. జపాన్, చైనా వంటివాటిలో రిలీజ్ చేసి కొంత రికవరీ వస్తుందని ఆశించారు. కానీ అక్కడ కూడా సినిమాకి ఆదరణ లేకపోవడం మరింత నిరాశ కలిగించిందట. వైవిధ్యమైన సినిమాలతో మిస్టర్ పర్‌ఫెక్ట్‌గా పేరు తెచ్చుకున్న అమీర్ ఇప్పుడు కొంత వెనుకబడ్డట్లే కనిపిస్తున్నారు. ఓవైపు లాల్ సింగ్ చద్దా డిజాస్టర్, మరోవైపు తన కొడుకు సినిమాలు కూడా ఓటిటీలో దారుణంగా ఫెయిల్ అవ్వడం అమీర్‌ని కలిచి వేసిందని చెబుతున్నారు.అయితే ఈ మధ్య అమీర్ నటించిన సితారే జమీన్ పర్ మాత్రం మంచి విజయం సాధించింది. లేకుంటే పరిస్థితి వేరేలా ఉండేది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## ఒకే కాన్పులో నలుగురు చిన్నారులు జననం

మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన 27 ఏళ్ల మహిళ శనివారం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. ఆ మహిళకు ఇది మూడో కాన్పు. ఆమెకు మొదటి సారి కవలలు (ఒక అబ్బాయి , ఒక అమ్మాయి జన్మించారు. రెండవ ప్రసవంలో బాలిక జన్మించింది. ఇప్పుడు మూడో సారి ఏకంగా నలుగురు చిన్నారులకు జన్మనిచ్చింది. ఈ పిల్లల్లో ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగ శిశువు ఉన్నారు. అయితే ఈ శిశువులు 1200 నుంచి 1600 గ్రాముల మధ్య బరువు కలిగి ఉన్నారు. పిల్లలు తక్కువ బరువు ఉండడంతో.. ప్రస్తుతం వారిని శిశువులను నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)లో ఉంచారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. తల్లి పిల్లలు క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి సిబ్బంది చెప్పారు. సతరా ఆస్పత్రిలో పురిటినొప్పులతో చేరిన మహిళ ఆరోగ్య తీవ్రత దృష్ట్యా సిజేరియన్ చేయాలని వైద్య బృందం నిర్ణయించారు. దీంతో ప్రసూతి విభాగానికి చెందిన డాక్టర్ సదాశివ్ దేశాయ్, డాక్టర్ తుషార్ మస్రామ్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ నీలం కదమ్ , డాక్టర్ దీపాలి రాథోడ్ లతో కూడిన వైద్యుల బృందం ఆ మహిళకు ఆపరేషన్ ను విజయవంతంగా పూర్తి చేశారు. ఇలా ఒకే కాన్పులో నలుగురు పిల్లలు పుట్టడంతో వైద్యులు ఆశ్చర్య పోయారు.

## కాంగ్రెస్ కమీషన్ల సర్కారంటూ.. కవిత మళ్లీ ఫైర్

ఆడబిడ్డల చదువుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. ఆడబిడ్డల చదువులను ఈ కాంగ్రెస్ కమీషన్ల సర్కారు కాలరాస్తోంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంలో ఉద్దేశపూర్వకంగానే ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలను రేవంత్ ప్రభుత్వం ఎగవేస్తుందని ఆమె ఆరోపించారు. 20 శాతం కమీషన్లు ఇస్తేనే రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారంటూ కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతోన్నాయని వివరించారు. కమీషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్‌లో ఉంచుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికే కాలేజీలు నడప లేక ఆర్థికంగా యాజమాన్యాలు చితికిపోయ్యాయని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కాలేజీలు మూతపడితే చదువుకు ఆడబిడ్డలు దూరం అవుతారని కవిత పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కల్వకుంట్ల కవిత స్పందించారు. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి భారీగా జరిగిందంటూ రేవంత్ సర్కార్‌కు అందిన నివేదికలు స్పష్టమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ అవినీతిలో బీఆర్ఎస్ అధినేత, తన తండ్రి కేసీఆర్ ప్రమేయం



లేదని కవిత మీడియా ద్వారా స్పష్టం చేశారు. అంతేకాకుండా.. ఈ అవినీతి చేసింది హరీశ్ రావుతోపాటు సంతోష్ రావు అంటూ ఆమె కీలక ఆరోపణలు చేశారు.ఈ నేపథ్యలో ఆ పార్టీ అగ్రనేత కేసీఆర్.. కవితపై సస్పెన్షన్ వేటు వేశారు. దాంతో ఆమె ఆ పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. ఆమె కొత్త పార్టీ స్థాపించి.. తద్వారా ప్రజల్లోకి వెళ్తారంటూ ఒక ప్రచారం అయితే సాగుతోంది. అదీకాక.. ఇటీవల కాలంలో ఆమె ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గళం విప్పుతున్నారు. అందులోభాగంగా ధర్నా చౌక్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు.




## అప్పుడు ఇడ్లీకి కూడా డబ్బులు లేవు

ధనుష్ హీరోగా నిత్యామీనన్ హీరోయిన్ గా నటిస్తున్న సినిమా ఇడ్లీ కొట్టు. విజయవంతమైన 'తిరు' తర్వాత వీరిద్దరి కలయికలో రాబోతున్న చిత్రమిది. అక్టోబర్ 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆడియో లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ధనుష్ మాట్లాడుతూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. 'నా చిన్నతనంలో రోజూ ఇడ్లీ తినాలనిపించేది. కానీ, అప్పుడు నా దగ్గర డబ్బులు లేవు. ఇప్పుడు డబ్బులు ఉన్నాయి. కానీ, నా చిన్నతనంలో ఇడ్లీ తినేప్పుడు ఉన్న ఆనందం, రుచి ఇప్పటి రెస్టరంట్‌లలో ఉండడం లేదు' అంటూ ధనుష్ చెప్పడం ఆకట్టుకుంది. ధనుష్ ఇంకా మాట్లాడుతూ.. 'ఇక ఈ చిత్రం నిజ జీవితం ఆధారంగా తెరకెక్కింది. ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది' అని ధనుష్ తెలిపారు. అలాగే, తనను ట్రోల్ చేసేవారి గురించి కూడా ధనుష్ మాట్లాడారు. 'అసలు 'హేటర్స్' అనే కాన్సెప్టే లేదు. ఎందుకంటే, అందరూ హీరోలందరి సినిమాలు చూస్తారు.

## యూపీఐ లావాదేవీల్లో నేటి నుండి పెద్ద మార్పు..

# రూ.10 లక్షల వరకు లావాదేవీలు!



నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) అనేక వర్గాలలో UPI లావాదేవీల పరిమితిని పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇది నేటి నుంచి అమలులోకి రానుంది. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ ద్వారా అధిక విలువ కలిగిన డిజిటల్ లావాదేవీలను సులభతరం చేసే దిశగా ఒక పెద్ద అడుగు వేస్తూ, NPCI లావాదేవీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచింది. UPI చెల్లింపు నియమాలలో ఈ ముఖ్యమైన మార్పులు సెప్టెంబర్ 15, 2025 నుండి అమల్లోకి వస్తున్నాయి. దీని తర్వాత ఇప్పుడు బీమా, మూలధన మార్కెట్, లోన్ EMI, ప్రయాణ వర్గాలలో ప్రతి లావాదేవీకి రూ. 5 లక్షల వరకు లావాదేవీలు చేయవచ్చు. అయితే రోజుకు రూ.10 లక్షల వరకు లావాదేవీలు చేయవచ్చు.

కొత్త పరిమితి ఎక్కడ వర్తిస్తుంది?

UPI చెల్లింపుల కోసం కొత్త పరిమితి వ్యక్తి నుండి వ్యాపారికి (P2M) చెల్లింపులపై అమలులోకి వస్తుంది. అంటే ఈ మార్పు ధృవీకరించబడిన వ్యాపారులు,సంస్థలకు చెల్లింపులపై వర్తిస్తుంది. దీని కింద కొన్ని వర్గాలలో గరిష్టంగా రూ. 5 లక్షలు, మరికొన్నింటిలో గరిష్టంగా రూ. 10 లక్షలు రోజుకు చేయవచ్చు. ఆగస్టు 24న జారీ చేసిన సర్క్యులర్‌లో NPCI ఈ మార్పు గురించి తెలియజేసింది. అాగే యూపీఐ ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత గల చెల్లింపు విధానంగా మారిందని, పెద్ద లావాదేవీలకు




పెరుగుతున్న డిమాండ్ దృష్ట్యా, యూపీఐ చెల్లింపు రోజువారీ పరిమితిని పెంచే ఈ చర్య తీసుకుంటున్నట్లు పేర్కొంది. ఈ పెరిగిన పరిమితి రూ. 5 లక్షల వరకు పన్ను చెల్లింపు వర్గంలోకి వచ్చే సంస్థలకు వర్తిస్తుంది.

## తెలంగాణలో బొడ్డెమ్మ పండుగ సంబరాలు

తీరొక్క పూలతో తొమ్మిది రోజుల పాటు ప్రకృతితో మమేకమై.. పూల జాతరగా మారే తెలంగాణ సంప్రాదాయిక బతుకమ్మ పండుగ కోసం ఆడపడుచులందరూ ఎదురుచూస్తారు. ఎంతో ఉత్సాహంగా సాగే బతుకమ్మ సంబురాల కంటే ముందు బొడ్డెమ్మ ముందుకు వస్తోంది. పెత్రమాస నుంచి ఎంగిలిపూల బతుకమ్మ మొదలవుతే అంతకంటే ముందు ఇళ్లవద్దే పిల్లలు, యువుతులు ఆడుకునే బొడ్డెమ్మ ఆటపాట సోమవారం నుంచి వినిపించనుంది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో తొమ్మిది రోజుల ముందు, ఎక్కువ ప్రాంతాల్లో ఏడు, ఐదు రోజుల నుంచి బొడ్డెమ్మ పండుగ మొదలవుతుంది. తెలంగాణ ప్రభుత్వం బతుకమ్మ పండుగను గుర్తించి ఈనెల 21 నుంచి 30 తేది వరకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇదే క్రమంలో బొడ్డెమ్మను గుర్తించకపోవడంతో చిన్నబోతోంది. ఈ నేపథ్యంలోనే బొడ్డెమ్మ సంస్కృతి కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. సోమవారం నుంచి బొడ్డెమ్మ పండుగ ప్రారంభం కానుంది. ఇప్పటికి కొన్ని ప్రాంతాల్లో బొడ్డెమ్మ సంస్కృతి పదిలంగానే ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంతో పాటు వేములవాడ, ఇతర మండలాల్లో బొడ్డెమ్మను ఆడుకుంటున్నారు.బొడ్డెమ్మ బొడ్డెమ్మా కోల్... బిడ్డలు ఎందరే.. అంటూ చిన్నారులు ప్రధానంగా బొడ్డెమ్మా ఆటలు ఆడుకుంటారు. బొడ్డెమ్మ అనే పదాన్ని అమ్మవారి నామాలతో ఒక నామంగా గుర్తించి బొడ్డెమ్మను పుట్టమన్నుతో చిన్నపిల్లలు, కన్నెపిల్లలు కలిసి ఒక పీటపైన ఎర్రమట్టితో అంతస్తు లుగా, గుండ్రంగా బొడ్డెమ్మను తయారు చేస్తారు. పీట మీద తయారుచేసి మట్టిపైనా శిఖరంగా బీర, కట్ట, గన్నేరు,



నందివర్ధనం వంటి పూలతో బొడ్డెమ్మ ప్రతిరోజు అలికి అలంకరించి రోజూ ఆటలాడి తొమ్మిది రోజుల పాటు ఇళ్లలోనే ఉంచి చివరి రోజు చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేస్తారు. ప్రతి రోజు సాయంత్రం అలం కరించి.. దూపదీప నైవేద్యాలతో అర్చిస్తూ... బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతారు. బొడ్డెమ్మ పాటల్లో చందమా మను కలుపుతూ... పాడుకోవడం ప్రధానంగా కనిపిస్తుంది. బొడ్డెమ్మ తరువాత వచ్చే అమావాస్య నుంచి మహిళలు బతుకమ్మ సంబరాలను ప్రారంభి స్తారు. బొడ్డెమ్మ సంబురాల తరువాత మరుసటి రోజు పెత్ర అమావాస్య నుంచి చిన్న బతుకమ్మ సంబరాలు మొదలై పెద్ద బతుకమ్మతో ముగుస్తాయి. ఈసారి ఈనెల 21వ తేదిన అమవాస్య వస్తుండడంతో ఎంగిలిపూల బతుకమ్మ మొదలు కానుంది. పెద్ద బతుకమ్మ ఈనెల 30న జరుపుకోనున్నారు.

## హాట్ బ్యూటీ శ్రద్ధా

బాలీవుడ్ బ్యూటీ శ్రద్ధా కపూర్.. తాజాగా సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ తెగ వైరల్ అవుతున్నది. విరహమో, విరక్తో తెలియకుండా ఆమె రాసుకొచ్చిన చిన్న కవిత.. శ్రద్ధా అభిమానులలో ఆసక్తితోపాటు ఆందోళననూ రేకెత్తిస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది 'స్త్రీ-2'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నది శ్రద్ధా కపూర్. ఆ సినిమా విజయంతో.. ఇక శ్రద్ధ దశ మారిపోయినట్లేనని, ఆఫర్లు క్యూ కడతాయని అందరూ ఊహించారు. కానీ, 'స్త్రీ-2' సక్సెస్‌ను శ్రద్ధా క్యాష్ చేసుకోలేక పోయినట్లే కనిపిస్తున్నది. అందులోనూ.. ఆమె వ్యక్తిగత జీవితం కూడా కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. సినీ రచయిత రాహుల్ మోడీతో శ్రద్ధా డేటింగ్ చేస్తున్నదనీ, ఈ ఏడాదే వీళ్లు పెళ్లి పీటలు ఎక్కబోతున్నారనే వార్త బీటౌన్‌లో షికారు చేసింది. అయితే, ఆమె తాజాగా సోషల్ మీడియాలో చేసిన పోస్ట్.. ఈ అంచనాలను పటాపంచలు చేసింది.



కొడంగల్‌లో రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడించిన

## అంగన్‌వాడీ కార్యకర్తలు

కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని అంగన్‌వాడీ కార్యకర్తలు ముట్టడించారు. ప్రీప్రైమరి వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు కొడంగల్‌కు తరలిరావడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొన్నది. ఆందోళన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు.. వారిని అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు.